ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 26 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 8 మే 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




ఆపరేషన్ సింధూర్
## మనందరికీ గర్వకారణం

**పహల్గామ్‌కు భారత్ ప్రతీకార దాడి**
**కేబినేట్ సమావేశంలో ప్రధాని మోడీ వివరణ**

న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం): పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి సంబంధించి బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ దాడి గురించి ప్రధాని మోడీ సభ్యులకు వివరించారు. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ఆయన హర్షం వ్యక్తం చేసినట్లు- తెలుస్తోంది. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైన దాడిగా 'ఆపరేషన్ సిందూర్'ను అభివర్ణించారని సమాచారం. పీఓకేలో ఐదు, పాక్‌లో నాలుగు ఉగ్ర శిబిరాలను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో

..మిగతా 2లో

సరిహద్దులో కాల్పులకు
## తెగబడ్డ పాక్ ఆర్మీ

**15 మంది పౌరులు మృతి** 2

ఆపరేషన్ సిందూర్‌తో
# ఉగ్ర శిబిరాలు నేలమట్టం



- ఆపరేషన్ సిందూర్ 25 నిమిషాలు, 9 స్థావరాలపై దాడి
- 70 మంది ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. 2016 నాటి యూరి ఘటన అనంతరం జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడుల శైలికి ఇది పూర్తిగా భిన్నమైనది. వ్యూహాత్మకంగా, సాంకేతికంగా అత్యంత శక్తివంతమైన ఆపరేషన్ ఇది. ఈ చర్య ద్వారా ఉగ్రవాదం విషయంలో భారత్ తన వైఖరిని మార్చుకుందని, మరింత కఠినంగా వ్యవహరిస్తుందనే స్పష్టమైన సంకేతాన్ని పాకిస్థాన్‌కు పంపినట్లయింది. ఈ ఆపరేషన్ ద్వారా భారీ సంఖ్యలో ఉగ్రవాదులు హతమవ్వడంతో, ఉగ్రవాద సంస్థల నెట్‌వర్క్‌లకు, వాటిని నడిపించే సూత్రధారులకు తీవ్రమైన హెచ్చరికలు వెళ్లినట్లుగా

..మిగతా 2లో



అంతం కాదిది..
## ఆరంభం మాత్రమే

**అసలు సినిమా ముందుంది**
**ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం): అంతం కాదిది ఆరంభం అని భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా అప్పుడే అయిపోలేదు..ఇంకా ఉంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్ర

..మిగతా 2లో



భారత్‌తో ఉద్రిక్తతలు తగ్గాలన్నదే
## మా లక్ష్యం

**రెచ్చగొడితే దీటుగా బదులిస్తాం: పాక్ రక్షణ మంత్రి**

ఇస్లామాబాద్, మే 7 (ప్రభాత ఉదయం): భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తలను తగ్గించేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తెలిపారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితి నుంచి బయటపడాలని భారత్ ఆశిస్తే, ఆ దిశగా చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో పాటు పీవోకే లోని ఉగ్ర స్థావరాలను భారత్ నేలమట్టం చేసిన తర్వాత ఖవాజా స్పందించారు. బ్లూమ్‌బర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పాకిస్థాన్

..మిగతా 2లో

# 'కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోండి'

**ఆపరేషన్ సిందూర్‌తో ప్రభుత్వం అప్రమత్తం**
**సైన్యానికి మనో ధైర్యం ఇచ్చేలా నేడు ర్యాలీ**
**ఆస్పత్రులు, మందుల నిల్వలు, రక్త నిల్వలు సన్నద్ధం చేసుకోండి**
**24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్**
**ఉద్యోగులు, అధికారులు, మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు**
**అధికారులతో అత్యవసర సమావేశంలో ఆదేశించిన సిఎం రేవంత్**



హైదరాబాద్, మే 7 (ప్రభాత ఉదయం): 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా వెన్నంటి ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు

..మిగతా 2లో




దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాల
## మూసివేత

**ఈ నెల 10 వరకు విమాన రాకపోకలపై నిషేధం**
**విమానాలను రద్దు చేసిన పలు విమానయాన సంస్థలు** 2

# కృష్ణా నీటి అక్రమ వాడకాలకు చెక్

**పలుచోట్ల టెలీమెట్రీ ఏర్పాటు చేయాలి**
**పోలవరం బ్యాక్ వాటర్ ముప్పు తప్పించాలి**
**కేంద్ర జలసంఘాన్ని కోరిన మంత్రి ఉత్తమ్**

న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం): కృష్ణా నది నుంచి ఎపి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైన్ తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులతో పాటు అనేక అంశాలను చర్చించారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం

..మిగతా 2లో






ఓ వైపు ఆపరేషన్ సింధూర్
## మరో వైపు మాక్ డ్రిల్

హైదరాబాద్, మే 7 (ప్రభాత ఉదయం): పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్న వేళ... 'ఆపరేషన్ సిందూర్'పేరిట భారత్ మెరుపు దాడులతో గట్టి సమాధానం ఇచ్చింది. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ తాము దాడులు చేస్తామని ప్రేలాపనలు పేలుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై అవగాహన కల్పించాలని కేంద్రహోం శాఖ నిర్ణయించింది. దానిలో భాగంగా దేశవ్యాప్తంగా సాయంత్రం నాలుగు గంటలకు మాక్ డ్రిల్స్ ప్రారంభమయ్యాయి. ఈ మాక్ డ్రిల్స్‌లో పాల్గొనాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్

..మిగతా 2లో

# ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్ర శిబిరాలు నేలమట్టం

మొదటి పేజీ తరువాయి...

చెప్పవచ్చు. అవసరమైతే పాకిస్థాన్ భూభాగంలోని ఏ లక్ష్యాన్నైనా ఛేదించడానికి భారత్ వెనుకాడదని, లక్షిత దాడులు చేయగల సత్తా తమకుందని ఈ ఆపరేషన్ ద్వారా నిరూపితమైంది. ఉగ్రదాడులకు ప్రతిస్పందన కేవలం సైనిక శక్తి ప్రదర్శనకే పరిమితం కాదని, ఉగ్రవాదుల కార్యకలాపాలకు, వారికి లభించే ఇతర వనరుల పునాదులను సమూలంగా పెకిలించి వేస్తామని భారత్ ఈ చర్యతో స్పష్టం చేసినట్లయింది. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల సామర్థ్యం ఉన్న 24 ఆయుధాలను ఈ ఆపరేషన్‌లో భారత దళాలు వినియోగించాయి. వీటిలో శక్తివంతమైన క్షిపణులు, బాంబులతో పాటు ఆత్మాహుతి డ్రోన్లు కూడా ఉన్నాయి. ఈ ఆయుధాల ద్వారా ఏకకాలంలో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో దాదాపు 80 మందికి పైగా ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది వరకు గాయపడినట్లు అంచనా. ఈ దాడికి ముందు, భారత ఇంటెలిజెన్స్ అధికారులు అత్యంత పకడ్బందీగా సమాచారాన్ని సేకరించారు. ఉపగ్రహ చిత్రాలు, మానవ వనరుల ద్వారా అందిన నిఘా సమాచారం, ఉగ్రవాదుల మధ్య జరిగిన కమ్యూనికేషన్లను లోతుగా విశ్లేషించి, జైషే మహమ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు వినియోగించే శిక్షణా కేంద్రాలను, కాంప్లెక్స్‌లను గుర్తించారు. వీటితో పాటు ఆయా సంస్థలకు చెందిన ఆయుధ డిపోలు, బ్రెయిన్ వాషింగ్ కేంద్రాలు, స్లీపర్ సెల్ ప్రణాళికా కేంద్రాలను కూడా నిర్ధారించుకున్నారు. సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉన్న ఉగ్ర స్థావరాలపై కొన్ని రోజుల పాటు డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచారు. ఆయుధాల ఎంపికలో కూడా భారత దళాలు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. స్కాల్ప్ క్రూజ్ మిసైల్, హ్యామర్ గైడెడ్ బాంబులు వంటి అధిక కచ్చితత్వం కలిగిన ఆయుధాలతో పాటు, ఆత్మాహుతి డ్రోన్లను కూడా ఈ ఆపరేషన్‌లో వినియోగించారు. సుమారు 25 నిమిషాల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో, అంతర్జాతీయ సరిహద్దు నుంచి దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో పాకిస్థాన్‌లోని బహవల్పూర్‌లో ఉన్న జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరంతో పాటు పలు ఇతర స్థావరాలను నేలమట్టం చేశారు. ఈ బహవల్పూర్ ప్రాంతంలో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన రెజిమెంటల్ సెంటర్ కూడా ఉండటం గమనార్హం. పాకిస్థాన్‌లో అత్యంత కీలకమైన పంజాబ్ ప్రావిన్స్‌లోనే నాలుగు ఉగ్రవాద శిబిరాలను ఈ ఆపరేషన్‌లో ధ్వంసం చేశారు.



### ఆపరేషన్ సిందూర్‌తో
## మసూద్ ఆజార్‌కు దెబ్బ
### దాడిలో కుటుంబ సభ్యులు సహా పది మంది మృతి

పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై బాంబుల వర్షం కురిపించింది. ముఖ్యంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని నేలమట్టం చేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్ లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు సమాచారం. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులేనని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మసూద్ అజార్ సోదరి-ఆమె భర్త, మసూద్ మేనల్లుడు-అతడి భార్య, మేనకోడలు, ఐదుగురు చిన్నారులు మృతి చెందినట్లు- తెలుస్తోంది. ఈమేరకు జైషే వర్గాలను ఉటంకిస్తూ ఆ కథనాలు పేర్కొన్నాయి. వీరితో పాటు- అజార్ అత్యంత సన్నిహితులు నలుగురు మరణించినట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ లేదు. భారత్ జరిపిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్ లోని మర్కజ్ సుబాన్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా అభివర్ణిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలకు ఇక్కడే పథక రచన చేశారు. మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటు-ంబసభ్యులు కూడా దీనిలోనే ఉంటు-న్నట్లు- సమాచారం. దాదాపు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు- తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు దాడులు నిర్వహించాయి. భారత సైన్యం జరిపిన దాడుల్లో తన కుటు-ంబానికి చెందిన 10 మంది సభ్యులు సహా మరో నలుగురు సహాయకులు మరణించారని జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ చెప్పారని బీబీసీ ఉర్దూ కథనాలు ప్రచురించింది. ఇక, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైష్, లష్కరే-తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లతో సంబంధం ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై బుధవారం తెల్లవారుజామున 1.05 గంటలకు భారత్ దాడి చేసింది.

### ఆపరేషన్ సిందూర్
## మనందరికీ గర్వకారణం

మొదటి పేజీ తరువాయి...

ప్రధాని వారికి చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారని తెలుస్తోంది. ఈ క్యాబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలా ఉంటే.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడులను భారత ఉన్నతాధి కారులు ప్రపంచ దేశాలకు వివరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్టు- అమెరికా, రష్యా, యూకే, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం అందించారు. మెరుపు దాడులపై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శితో .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దభోల్ మాట్లాడారు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదదీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా జంటల్లో పురుషులను వేరు చేసి.. వారిని మతం అడిగి మరీ కాల్చి చంపారు. ఉగ్రమూక టార్గెట్ చేసిన జంటల్లో అప్పటికి ఆరు రోజుల క్రితమే పెళ్లైన నవవధూవరులు వినయ్ నర్వాల్, హిమాన్షి ఉన్నారు. -టె-ర్రరిస్టులు వినయ్‌ను హత్య చేయగా.. అతడి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న హిమాన్షి చిత్రం దేశం మొత్తాన్ని కుదిపేసింది. వినయ్ నేవీ అధికారి కూడా. ఈ ఉగ్ర దాడిలో భర్తలను కోల్పోయిన మహిళల ప్రతీకారానికి చిహ్నంగా దీనిని చూడొచ్చు. యోధులకు పెట్టే వీరతిలకం అనే అర్థం కూడా దీనిలో ఉంది.

## కృష్ణా నీటి అక్రమ వాడకాలకు చెక్

మొదటి పేజీ తరువాయి...

ఛైర్మన్ అతుల్ జైతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్‌లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్.. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. డీపీఆర్‌లో చూపిన స్థలం ఒకటి కాగా, అసలు నిర్మాణం వేరే ప్రాంతంలో జరిగిందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్సీ సూచించిందని చెప్పారు. అలాగే నూతన నిర్మాణాలు, కేటాయింపులపై ఆయన చర్చించారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించనున్నట్లు- వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీ-ఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీ-ఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



### 'కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
## తీసుకోండి

మొదటి పేజీ తరువాయి...

ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్, హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు- ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు- సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు- భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ- సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## సరిహద్దులో కాల్పులకు తెగబడ్డ పాక్ ఆర్మీ

న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం): భారత వైమానిక దాడుల తర్వాత పాకిస్థాన్ నియంత్రణరేఖ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భారీగా కాల్పులు జరుపుతోంది. ముఖ్యంగా సరిహద్దు గ్రామాలు, ప్రజల ఇళ్లపై మోర్టార్లు, ఫిరంగులను ప్రయోగించింది. పాక్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాలకు చెందిన 15 మంది ప్రాణాలు కోల్పోగా.. 43మంది గాయపడినట్లు పూంచ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ పర్వైజ్ అహ్మద్ ఈటీవీ భారత్‌కు వెల్లడించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు చెప్పారు. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. భారత్ ఎదురుదాడిలో పాకిస్థాన్ సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. భారత మెరుపు దాడులకు ఏం చేయాలో పాలుపోని పాకిస్థాన్ జమ్ముకశ్మీర్‌లో పెద్ద ఎత్తున కాల్పులకు జరుపుతోంది. మోర్టార్లు, ఫిరంగులతో సరిహద్దు గ్రామాలపై దాడులకు దిగింది. పాకిస్థాన్ రేంజర్లు రాత్రి నుంచి నిరంతరాయంగా జరుపుతున్న కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. అయితే పాక్ రేంజర్లు పూంచ్ జిల్లాలో భారత సరిహద్దు గ్రామాలను, ప్రజల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతున్నారు. ఫలితంగా అమాయకులైన పౌరులు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పూంచ్‌తో పాటు రాజౌరి, కుప్వారా జిల్లాలోని యురి, కర్నాహ్, తంగ్దర్ సెక్టార్లలోనూ పాక్ భారీ ఎత్తున కాల్పులు జరుపుతోంది. పాక్ కాల్పులకు..... భారత సైన్యం ధీటుగా స్పందిస్తోంది. భారత్ భీకరకంగా ఎదురుకాల్పులకు దిగడంతో పాక్ వైపు ఆర్మీ పోస్టులు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. పొరుగుదేశంలో భారీగానే నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లోని అన్ని విద్యా సంస్థలనుమూసివేశారు. జమ్ము, సాంబ, కథువ, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో విద్యాసంస్థలు బుధవారం మూసివేస్తున్నట్లు డివిజినల్ కమిషనర్ రమేష్ కుమార్ చెప్పారు. పాకిస్థాన్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. పాక్ కాల్పుల నుంచి తప్పించుకునేందుకు సరిహద్దు గ్రామాల ప్రజలు భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మరికొంత మంది సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్నారు. పాకిస్థాన్ తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్ లోనూ అప్రమత్తత ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు జిల్లాలైన ఫిరోజ్ పూర్, పఠాన్ కోట్ , ఫజిల్కా, అమృత్ సర్ , గురుదాస్ పూర్ లో నేడు అన్ని విద్యాసంస్థలను మూసివేశారు.




### దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాల
## మూసివేత

**న్యూఢిల్లీ, మే 7 (ప్రభాత ఉదయం):** పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో రాకపోకలు నిలిచి పోయాయి. ఈ నెల పదివారకు ఆయా విమానాశ్రయాల నుంచి రాకపోకలను నిషేధించారు. అలాగే విమానసర్వీసులను రద్దుచేశారు. ఈ క్రమంలోనే ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10వ తేదీ వరకు 165కు పైగా విమానాలను రద్దు చేస్తున్నట్లు- ప్రకటించింది. గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పుర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నామని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది.




### ఓ వైపు ఆపరేషన్ సింధూర్
## మరో వైపు మాక్ డ్రిల్

మొదటి పేజీ తరువాయి...

డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ కోర్, ఎన్ఎస్ఎస్, నెహ్రూయువ కేంద్ర సంఘటన్, కాలేజ్‌లు, స్కూల్ విద్యార్థులకు ఇప్పటికే కేంద్రం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లోని 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధ సమయంలో అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈ సారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైరన్ మోతలు వినిపించాయి.

### అంతం కాదిది..
## ఆరంభం మాత్రమే

మొదటి పేజీ తరువాయి...

స్థావరాలపై దాడిని ఉద్దేశిస్తూ..మాజీ చీఫ్‌ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ శంకర్ రాయ్ చౌదరి కూడా స్పందించారు. ఉగ్రస్థావరాలపై భారత బలగాలు చేసిన దాడిని అద్భుతమైన ప్రణాళికతో కూడిన గొప్ప ఆపరేషన్‌గా ప్రశంసించారు. ఈ దాడులను భారత్ ఆపకూడదని.. కొనసాగించాలని సూచించారు. ఇది యుద్ధం లాంటి పరిస్థితి కాదని.. ఇప్పటికే ఇరుదేశాల మధ్య అప్రకటిత యుద్ధం కొనసాగుతోందని అన్నారు. దాడుల సమయంలో మాజీ ఆర్మీ చీఫ్‌ల నుంచి ఈతరహా స్పందన రావడం గమనార్హం. పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత్ పెద్దఎత్తున విరుచుకుపడింది. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్ర పన్నినట్లు- భావిస్తున్న మొత్తం తొమ్మిది స్థావరాలపై ఆర్మీ దాడులు చేపట్టి.. 'ఆపరేషన్ సిందూర్ ' విజయవంతంగా నిర్వహించినట్లు- సైన్యం ప్రకటించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ మీడియాకు వెల్లడించింది. భారత ప్రభుత్వం ప్రకటన అనంతరం ఇండియన్ ఆర్మీ స్పందించింది. 'న్యాయం జరిగింది' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. తాజాగా ఈ విషయంపై కేంద్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ విలేకరులతో మాట్లాడారు.

# మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని కలసి అభినందనలు తెలియచేసిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ తదితరులు





మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి ని కలసి పుష్ప గుచ్ఛం అందచేసి అభినందనలు తెలుపుతున్న బీ ఆర్ ఎస్ మైలార్ దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్

బుద్వేల్, మే 7 (ప్రభాత ఉదయం): ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ని నిర్దోషిగా గా ప్రకటించిన సందర్భంగా బుదవారం ఆమె నివాసానికి అభిమానుల తాకిడి ఎక్కువైంది. సబితమ్మను కలసి ప్రతి ఒక్కరు అభినందనలు తెలియ జేశారు. మైలార్ దేవుపల్లి డివిజన్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ పి సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి నుండి పి సబితా ఇంద్రారెడ్డి దశాబ్ద కాలంలోమచ్చలేని నాయకురాలుగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గాని తెలంగాణలో కూడా ప్రజల మన్ననలను పొందుతూ ప్రజాక్షేత్రంలో మచ్చలేని నాయకురాలుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకురాలు సబితమ్మ అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీ ఆర్ ఎస్ నాయకులు నోముల రాము యాదవ్, కొంపల్లి జగదీష్, ఎస్ అశోక్ కుమార్, కార్తీక్ ముదిరాజ్ , వేణు, అనిల్, రామకృష్ణ , ప్రవీణ్ , సన్నీ, కార్తీక్, సుమన్, సాయి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు



పాండు యాదవ్ ను సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## మైలార్దేవుపల్లి డివిజన్-1 అధ్యక్షునిగా జి.పాండు యాదవ్

బుద్వేల్, మే 7(ప్రభాత ఉదయం) : మైలార్దేవుపల్లి డివిజన్-1 అధ్యక్షునిగా జి.పాండు యాదవ్ నియమితులైనారు. పాండు యాదవ్ ను మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సన్మానించి అభినందనలు తెలియజేశారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను తన దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. మైలార్దేవుపల్లి డివిజన్-1 బీజేపీ అధ్యక్షుడుగా నియమితులైన జి.పాండు యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికె జనార్ధన్, నాయకులు రావుల భాస్కర్, పి.సంతుగౌడ్, బొమ్మరాజు నర్సింమ్మ, ఉడుత లక్ష్మి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




తోకల శ్రీనివాస్ రెడ్డి

## భారత సైన్యానికి వందనం

### దేశ భద్రతలో సైనికుల పాత్ర మరువలేనిది రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, మే 7(ప్రభాత ఉదయం) : అమాయకులను కాల్చిచంపిన ఉగ్ర మూకలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' కు వందనమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పాకిస్థాన్ లోని తీవ్రవాద శిబిరాలపై భారత్ దాడి నేపథ్యంలో తోకల శ్రీనివాస్ రెడ్డి మాటాడుతూ..ఉగ్రవాద సంస్థలను కూకటివేళ్లతో సహా పెకిలించి వేసేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పాకిస్థాన్ లోని తీవ్రవాద శిబిరాలపై భారత్ దాడికి రాష్ట్రం, దేశమంతా మద్దతు ఇవ్వాల్సిన అవసరముందన్నారు. పార్టీలకతీతంగా దేశమంతా సైన్యం వెంట నడుస్తుంద న్నారు. భారతీయులందరం ఏకమై ఐక్యత చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద మూకల నిర్మూలన కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన కోరారు.ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రపంచ దేశాలు భారతదేశానికి మద్దతు పలుకుతున్నా యన్నారు.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మన దేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసిందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ దేశానికే గర్వకారణమని తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పహల్గాం ఉగ్రదాడిలో మన దేశ అమాయక ప్రజలు మృతి చెందడంతో ప్రజలు కన్నీరు పెట్టిందని గుర్తు చేశారు.దేశ ఆర్మీ జవాన్లు ఉగ్రవాదుల నిర్మూలననే లక్ష్యంగా ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ దాడులను చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారన్నారు.మన దేశం వైపు చూడాలంటనే భయపడే విధంగా పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై దాడి చేయడం సంతోషంగా ఉందన్నారు. దేశ భద్రతలో సైనికుల పాత్ర మరువలేనిదన్నారు.ఆపరేషన్ సింధూర్ చేపట్టిన దాడులతో ఉగ్రవాదం పూర్థిస్థాయిలో కనుమరుగుకావాలని ఆకాక్షించారు.

## కొలువుదీరిన స్వామివారు



బుద్వేల్, మే 7 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (హరి హర క్షేత్రం) లో కొలువు దీరిన స్వామీ వారి కి ఈ నెల 8వ తేదీన సాయంత్రం 6:30 గంటలకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నవరం సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం నిర్వహించే ముహూర్తానికి రాజేంద్రనగర్ లో శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి అనంతాచార్యులు తెలిపారు. కల్యాణాంతరం భజనలు ఉంటాయన్నారు. భజనల అనంతరం తీర్థ ప్రసాదాలు ఉంటాయని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుద్వేల్, మే 7(ప్రభాత ఉదయం): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. బెంగుళూరు జాతీయ రహదారి లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారా ముందు భాగంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొని 35 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్త చేస్తున్నారు.



## గరీబ్ నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

వరంగల్ మే 7,(ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ మహానగర పాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలోని గరీబ్ నగర్ లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను , శానిటేషన్, వాటర్ సప్లయ్ సమస్యలపై స్థానిక కార్పొరేటర్ సుంకరి.మనీషా శివకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా వాటర్ సమస్యలు ఉంటే వెంటనే తెలియపర్చాలని వాటర్ మెన్ కు సూచించారు. పలు గల్లీ లలో జరుగుతున్న మురుగు కాలువల నిర్మాణ నాణ్యతను పరిశీలించి పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో గరీబ్ నగర్ బీ.ఆర్.యస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మున్సిపల్ జవాన్,వాటర్ మెన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

### తెలంగాణ విధానమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



వరంగల్ మే 7, (ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ నగరంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ విధానమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ హామీ ఇచ్చారు. వరంగల్ నగరంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ 332 వ ఆరాధన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విధానమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ ప్రజల అభ్యున్నతికి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో సాయి మీరా కల్చరల్ అసోసియేషన్ వారి సాన్నిధ్యంతో గుటోజు కేదారేశ్వర చారి శిష్య బృందం చే ఆరాధన పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారడోజు సదానంద చారి జల్లి పల్లి పెంటయ్య చారి ఆధ్వర్యం లో జరిగింది.డాక్టర్ అనసూరి చంద్రమౌళి, వేల్పుల దేవా చారి, పెండోట చక్రపాణి, తంగళ్ళపల్లి జయసేన, చిట్టిమల్ల రామ్ బ్రహ్మం, బతోజు బ్రహ్మాచారి, అలుగోజు కృష్ణమూర్తి, కొక్కొండ శంకరయ్య, గన్నోజు జగన్, ఈశ్వర్, ఐలాపురం కోటి, చల్లూరి లింగస్వామి, శ్రీనివాస్, గన్నోజి మహేందర్, తాటికొండ దామోదర్, పెండోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిగటిద్దాం

### 4లేబర్ కోడ్ ల అమలుకు వ్యతిరేకంగా పోరాడుదాం

### మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం.. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

చెన్నూర్, మే 07. (ప్రభాత ఉదయం):చెన్నూరు మండల కేంద్రంలోని తాపీ సంఘం భవనంలో రైతు, సీఐటీయూ, వ్యకస, ఐద్వ సంఘాల సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్ ల రద్దును కోరుతూ మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంకె రవి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, వ్యవసాయ కూలీలా సమస్యలు పరిష్కరించడంలేదు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర లేదు, పండించిన పంటలకు రక్షణ లేదు.రైతు కూలీల మేడలకు ఉరితాళ్ళను బిగించే నల్ల చట్టాలను రద్దు చేయాలి. రైతులకు, ఉపాధి హామీ కూలీలకు కూలీ రేట్లు పెంచాలి. పెన్షన్, ఉద్యోగ భద్రత, వెల్ఫేర్ బోర్డు, ప్రమాదాభిమా సౌకర్యాలు కల్పించాలి. దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ 4లేబర్ కోడ్ లను తీసుకొస్తున్నారు.కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయి. 8గంటల పనిని 12గంటలకు పెంచి



కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంబంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తూ ప్రభుత్వ రంగంలో కార్మికొద్యమం మీద, కార్మిక ఐక్యత మీద దాడి చేస్తుంది.కులం, మతం, అస్తిత్వ భావజాలంతో కార్మికొద్యమం దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. కావున కార్మిక ఐక్య పోరాటలను ఉధృతం చేస్తూ జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన మే 20 దేశ వ్యాపిత సమ్మెను కార్మిక వర్గ కర్తవ్యంగా భావించి ప్రతీ కార్మికుడు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, రైతు, ఐద్వ, సంఘాల నాయకులు దాసరి రాజేశ్వరి, ఉమారాణి, యామిని, రమాదేవి, నరేష్, శారదా, ప్రవీణ, కరీమా, గట్టక్క తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా పసుపుల సంటీప్ ముదిరాజ్



బుద్వేల్, మే 7(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా ఉప్పర్ పల్లి కి చెందిన పసుపుల సందీప్ ముదిరాజ్ నియమితులైనారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సం దర్భంగా పసుపుల సందీప్ ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లడమే కాకుండ పార్టీని పట్టిష్టవంతంగా తయారు చేయడానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీదర్, నాయకులు ఎన్. మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, పి.మల్లేశ్ యాదవ్, బొక్క బాల్ రెడ్డి, కె. హరికిషన్ జీలకు దన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన రాయచూరు మున్నూరు కాపు సంఘం నాయకులు

### జూన్ 12న రాయచూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాక

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 7(ప్రభాత ఉదయం)ప్రతి సంవత్సరం ఏరువాక పౌర్ణమి సందర్భంగా రాయచూరు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముంగారు సాంస్కృతిక కార్యక్రమాల వేడుకలు సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు హైదరబాద్ లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. మున్నూరు కాపు సాంస్కృతిక కార్యక్రమాల 25వ వసంతాలు పూర్తి చేస్తున్న సందర్భంగా వేడుకల్లో హాజరుకావలసిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలకు తప్పకుండా హాజరవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రవిబోస్ రాజ్, మున్నూరు కాపు సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నర్సిరెడ్డి, ఉప్పేటి గోవింద్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజు, పాలెం మల్లేష్, జి. రాజు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ప్రారంభం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 7 (ప్రభాత ఉదయం) శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవ కార్యక్రమాలు బుధవారం అధ్యక్షులు ఆలూరు బిలకంటి రాము ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగింపుగా రాజ వీధిలోగల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంకి తీసుక రావడం జరిగింది . అధ్యక్షులు లిఆలూరు బిలకంటి రాము,ప్రధాన కార్యదర్శి లినరహరి.శ్రీనివాసులు మాజీ కౌన్సిలర్, పంచామృత అభిషేకం చేయడం జరిగింది అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంగం అధ్యక్షులు , దేవాలయ చైర్మన్ అయినటువంటి లిఆలూరు బిలకంటి.రాము రిచే పథకావిష్కరణ (ధ్వజారోహణ) ఆవిష్కరించడం జరిగింది అభిషేకం గద్వాల ఆర్యవైశ్యులు క్షీరాభిషేకం అందరూ పాల్గొన్నారు తదనంతరం కన్యలకు కన్యక పూజ చేయడం జరిగింది తదుపరి ఈ కార్యక్రమంలో అన్ని ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు గద్వాల ఆర్యవైశ్యులు మహిళలు పాల్గొన్నారు

## మైనర్ బాలుణ్ణి కత్తితో పొడిచిన యువకుడు

బుద్వేల్, మే 7(ప్రభాత ఉదయం): స్నేహితుల మధ్య ఏర్పడిన గొడవ కత్తిపోట్లకు దారి తీసిం ది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ శివానగర్ కు చెందిన నవీన్(22), 13 సంవత్సరాల బాలుడు స్నేహితులు. మంగళవారం రాత్రి వారిద్దరు గొడవ పడ్డారు. ఈ గొడవలో నవీన్ తన వద్ద ఉన్న కత్తితో ఆ బాలుణ్ణి పొడిచాడు. బాలునికి గాయమైంది. స్థానికులు ఆ బాలుణ్ణి చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



## అమీర్‌తో అల్లు అర్జున్ భేటీ

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు- చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్‌లో నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ- సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను ఇటీ-వల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు- తెలిపారు.

## తెలుగు వెబ్ సీరిస్‌లోకి కోవై సరళ



లేడీ కమెడియన్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే పేరు కోవై సరళ. అప్పట్లో ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగింది. ముఖ్యంగా బ్రహ్మానందం, కోవై సరళ జోడికి ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉండేవారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి, తనదైన బాషతో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో దాదాపు రెండు దశాబ్దాల పాటు కోవై సరళ అందరినీ మెప్పించింది. అయితే కారణాలు ఏవైనా ఆమె కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైంది. తెలుగు అని కాదు తమిళంలో కూడా అడపాదడపా సినిమాలు చేస్తోంది. అలా తెలుగులో డబ్ అయ్యి వచ్చిన సినిమాలను మాత్రమే తెలుగు వాళ్ళు చూసి ఆనందించాల్సిన వస్తుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు కోవై సరళ ఓ తెలుగు వెబ్ సీరిస్ లో ఎంట్రీ ఇస్తోందట. యంగ్ హీరోయిన్ రీతూ వర్మ, శివ కందుకూరి జంటగా నటిస్తున్న వెబ్ సీరిస్ 'దేవిక అండ్ డానీ'. ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇటీవలే రిలీజ్ అయింది. రీతూవర్మ కు ఇదే మొదటి వెబ్ సీరిస్. 'శ్రీకారం' మూవీ ఫేమ్ బి. కిశోర్ ఈ వెబ్ సీరిస్ ను డైరెక్ట్ చేశాడు. అతనితోపాటు- ఇందులో సూర్య వశిష్ఠ, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జయ్ క్రిష్ దీనికి మ్యూజిక్ అందించాడు. త్వరలో ఈ వెబ్ సీరిస్ జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది. మరి కోవై సరళ కామెడీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న తెలుగువారికి ఆమె ఈ వెబ్ సీరిస్ తో ఎలాంటి వినోదాన్ని పండిస్తుందో చూడాలి.

## నవ్వించడం కష్టమన్న నటి కేతిక శర్మ

'ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా 'సింగిల్'. ఈ చిత్రం చూస్తున్నంత సేపు మనస్ఫూర్తిగా నవ్వుకుంటూనే ఉంటారని అంటోంది నటి కేతిక శర్మ. శ్రీవిష్ణు జంటగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. ఇవానా మరో కథానాయిక. ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో కేతికహైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో చేయాలని ఎప్పటి నుంచో నా కోరిక. అది ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నేను ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. ఇది పూర్తిగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ముస్తాబైంది. దీంట్లో ప్రేమకథ కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నేను పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి. ఈ కథలో ఎమోషన్ తన పాత్ర ద్వారానే వస్తుంది. ఈ పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలిపింది. ఈ చిత్ర విషయంలో కామెడీ నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే వినోదం పండించడం అంత తేలికేం కాదు. అందులోనూ కామెడీ టైమింగ్ విషయంలో శ్రీవిష్ణును మ్యాచ్ చేయడం మరింత కష్టం. ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ చాలా సవాల్‌గా అనిపించింది. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేలా కార్తీక్ ఈ చిత్రాన్ని రూపొందించారని చెప్పింది. రాబిన్‌హుడ్'లోని నా ప్రత్యేక గీతం 'అదిదా సర్‌ప్రైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ పాట విషయంలో తలెత్తిన వివాదం నుంచి ఓ విషయం నేర్చుకున్నా. భవిష్యత్తుల్లో అలాంటి పాటలు చేసేటప్పుడు స్టెప్పుల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అలాగే తమిళ తెలుగు ద్విభాషా చిత్రం ఒకటి చేస్తున్నా. మరికొన్ని సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో ప్రకటిస్తారని కేతిక తెలిపింది.

# శుభంపై నాకు ఎంతో నమ్మకం ఉంది

## సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రముఖ నటి, నిర్మాత సమంత

ప్రముఖ నటి సమంత నిర్మాతగా ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద నిర్మిస్తున్న చిత్రం 'శుభం'. ఈ సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీకి వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు సమంత మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..

నటిగా ఓ శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవం ఉంది. కానీ నిర్మాతగా ఇది నాకు మొదటి శుక్రవారం. ఎంతో నర్వెస్‌గా ఉన్నాను. నిర్మాతకు ఎన్ని కష్టాలు ఉంటాయో నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. గత వారం రోజులుగా నిద్రలేని రాత్రులే గడుపుతున్నాను. పోస్ట్ ప్రొడక్షన్ టీం, మిక్సింగ్ టీం, ఎడిటింగ్ ఇలా అందరూ నిద్ర లేకుండా పని చేస్తున్నారు. నాకు నా టీం మీద మరింత గౌరవం పెరిగింది. 'శుభం' చిత్రం చాలా బాగా వచ్చింది. ఎంతో అభిమానం లభించింది. కానీ ఇంకా ఏదో చేయాలనే తపన, కోరిక మాత్రం ఉంటూ వచ్చింది. నేను తీసుకున్న ఆ బ్రేక్ టైంలో చాలా ఆలోచించాను. హీరోయిన్‌గా నేను ఏ సినిమాలు చేయలేకపోయాను. అసలు ఇక సినిమాల్లో నటిస్తానో కూడా తెలియని సమయంలో నిర్మాతగా మారాలనే ఆలోచన వచ్చింది. నటించకపోతేనేం సినిమాలు నిర్మించొచ్చు కదా అని అనుకున్నాను. కెరీర్ మొదలు పెట్టి దాదాపు 15 ఏళ్లు అయింది. నాకు ఇంత అనుభవం ఉంది కదా అని ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేశాను. ఎలాంటి హడావిడి లేకుండా సినిమాను ప్రారంభించాం. 8 నెలల్లోనే చిత్రాన్ని పూర్తి చేశాం. ఇప్పుడు ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. 'శుభం' అనే టైటిల్ పెట్టడానికి కారణం ఉంది. ఈ చిత్రంలో ఎక్కువగా సీరియల్ గురించి ఉంటుంది.. ఆ సీరియల్‌లో శుభం కార్డ్ ఎప్పుడు పడుతుందా? అని అంతా ఎదురుచూస్తుంటారు. అందుకే ఆ టైటిల్ పెట్టాం. ఇక నా ప్రొడక్షన్ కంపెనీకి ట్రా లా లా అని పెట్టడానికి కూడా కారణం ఉంది. చిన్నప్పుడు 'బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్' అనే పద్యం ఉండేది. అందుకే ట్రా లా లా అని పెట్టాం.

గౌతమ్ మీనన్ గారు నాకు మొదటి ఛాన్స్ ఇచ్చారు. ఆయన తల్చుకుంటే ఆ టైంలో ఏ టాప్ హీరోయిన్ అయినా నటించేవారు. కానీ ఆయన నాలాంటి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. నేను కూడా నిర్మాతగా కొత్త వారిని ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతోనే ఉన్నాను.

ఎన్నో కలలు కంటూ సినిమా పరిశ్రమలోకి వస్తారు. మా చిత్రం కోసం శ్రియా, శ్రావణి, షాలినీలు ఎంతో కష్టపడ్డారు. నా సినిమాలో నటించిన వారందరినీ చూస్తే నా పాత రోజులన్నీ గుర్తుకు వచ్చాయి. నటిగా ఉన్నప్పుడు నిర్మాత కష్టాలేవీ నాకు అర్థం కాలేదు. ఒక్క రోజు ఒక్క సీన్ అనుకున్నట్టుగా జరగకపోతే ఎంత నష్టం వస్తుంది.. డబ్బు ఎంత వృథా అవుతుందో నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది. ఎంతో మంది టైం వేస్ట్ అవుతుందని అర్థమైంది. 'శుభం' చిత్రానికి మంచి డేట్ దొరికింది. మే 9 అనేది సమ్మర్ హాలీడేస్‌లో ఉంటుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూసేందుకు వీలుంటుంది వివేక్ సాగర్ బీజీఎం అందరినీ ఆకట్టుకుంటుంది. మే 9న రిలీజ్ అవుతున్న మా 'శుభం' సినిమాని అందరూ చూసి సక్సెస్ చేయండి.





## ఓటిటిలోకి వచ్చేస్తున్న నితిన్ రాబిన్‌హుడ్

'సంక్రాంతి వస్తున్నాం', తదితర చిత్రాలను ఒకే సమయంలో అటు- ఛానల్‌లో, ఇటు- ఓటీటీలోకి తీసుకొచ్చింది 'జీ 5' సంస్థ. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' విషయంలోనూ అదే ఫాలో అవుతోంది. మే 10న సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం కానుందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. మార్చి 28న థియేటర్లలో విడుదలైందీ సినిమా. రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాలబాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకు అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలో అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్ఘీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్ల తర్వాత నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ సున్నిపెంట అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ- ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీ) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్? ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది?అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా?అనేది మిగతా కథ.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608